## క్లుప్తంగా

### పత్తికొండ- కర్నూలు రోడ్డుకు మరమ్మతులు



జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం

పత్తికొండటౌన్: పట్టణం నుంచి కర్నూలు రోడ్డులో దూదేకొండ సమీపంలోని హంద్రీనది బ్రిడ్జి వరకు ప్రధానరోడ్డుకు రూ.2.30 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. రెండు రోజులుగా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో నిధులు విడుదలైనట్లు కాంట్రాక్టరు దశరథరామిరెడ్డి తెలిపారు.

### తాగునీటి పథకం పనులు ప్రారంభం



తాగునీటి పథకం పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో శనివారం రూ.38 లక్షలతో చేపట్టిన తాగు నీటి పథకం పనులను ఎంపీటీసీ సభ్యురాలు తూము రామేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్‌జీవన్ కింద ఇంటింటికి కుళాయి, ఓవర్‌హెడ్‌ట్యాంక్, పైప్‌లైన్ పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు తాగు నీటిని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి, కాంతరెడ్డి, పురుషోత్తంరెడ్డి, నీలకంఠి తిమ్మరాజు, పూల రాజు, అల్లీ సాహెబ్ పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీరంగనాథ స్వామి రథోత్సవం



స్వామివార్ల కల్యాణోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో వెలసిన సంతాన వరదుడు శ్రీరంగనాథ స్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 10.25 గంటలకు ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామివార్ల కల్యాణం జరిగింది. స్వామివారిని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో భక్తజనుల మధ్యన స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది.

### పి.కోటకొండలో పర్యటించిన మలేరియ అధికారి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా మలేరియ అధికారి నూకరాజు

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండలో డెంగీ కేసు నమోదు కావడంతో జిల్లా మలేరియ అధికారి నూకరాజు శనివారం గ్రామాన్ని పరిశీలించారు. కేసు నమోదైన వ్యక్తి ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. పరిసరలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఆయన వెంట సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తదితరులు ఉన్నారు

### కేంద్రబలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఆలూరు రూరల్: పట్టణంలోని సాయిబాబా ఆలయం నుంచి గుంతకల్లు జంక్షన్, మెయిన్ బజార్ కోయనగర్, ఎల్లార్తి రోడ్డులో శనివారం కేంద్రబలగాలు కవాతు నిర్వహించాయి. అలాగే మండలంలోని మొలగవల్లి, హత్తిబెళగల్ గ్రామాల్లోనూ కవాతు నిర్వహించారు. ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు, లీసు సిబ్బంది ఉన్నారు.

### హాస్టల్‌కు పుస్తకాల సెల్ఫ్ విరాళం



పుస్తకాల సెల్ఫ్ అందించిన పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి బీసీ బాలికల హాస్టల్‌కు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు (1989–90 బ్యాచ్ పదవ తరగతి) శనివారం పుస్తకాల సెల్ఫ్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ, పూర్వ విద్యార్థి, హాస్టల్ హిందీ ట్యూటర్ గఫూర్‌బాషా, దాతల మిత్రబృందం వడ్ల మహేశ్, జాకీర్ హుస్సేన్, శివరామిరెడ్డి, హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి బుట్టా రేణుక



బుక్‌లెట్‌ను వృద్ధురాలికి ఇచ్చి మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్: వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగరేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. శనివారం 11వ వార్డులో కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌తో కలిసి ఇంటింటికి తిరిగి వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలుకరించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఇవి కొనసాగాలంటే మరోసారి జగనన్న ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అబ్రార్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు రంగన్న, రజాక్, రసూల్, గట్టు ఖాజ, మాబ్బాషా, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

#### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నందవరం మండలం కనకవీడుకు చెందిన జయరామిరెడ్డికి రూ.1.30 లక్షలు, ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన సోమిరెడ్డికి రూ.3లక్షల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. శనివారం స్థానిక కార్యాలయంలో చెక్కులను బుట్టా రేణుక లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతా రెడ్డి, మండల కన్వీనర్ శివప్పగౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు ముగతి విరూపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

#### మదర్ థెరిస్సా విగ్రహావిష్కరణ

స్థానిక ఎంబీ చర్చి వద్ద ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. పార్టీ పట్టణ అధికార ప్రతినిధి, వేదాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నిస్వార్థ సేవకురాలు మదర్ థెరిస్సాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అపారమైన సేవలందించిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దివ్యకళ, పార్టీ నాయకులు ఆల్‌ఫ్రెడ్‌రాజు దేవరాజు, కౌన్సిలర్లు రాజరత్నం, సుధాకర్, ఖాశీంబేగ్, వాహిద్, అమాన్, ఇషాక్, కోటకొండ నరసింహులు, విశ్వనాథ్, షాబుదీన్ తదితరులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## రాజీయే రాజమార్గం



కేసులు పరిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ జడ్జి దివ్య

ఆలూరు రూరల్: రాజీమార్గమే రాజమార్గమని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి దివ్య అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. క్షణికావేశంతో నేరాలకు పాల్పడి జైలు, కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా 31 కేసులను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో బార్ అండ్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ భాస్కర్ సీనియర్ న్యాయవాదులు వాయుజీవోత్తమరావు, ప్రవీణ్‌కుమార్, కె.రవి, హెచ్‌కే రవి తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, బైక్‌తో సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణ

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యం, బైక్‌ను మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం మండలం చెట్నేపల్లె గ్రామం దగ్గర స్కూటీపై వస్తున్న వ్యక్తులను నిలిపి తనిఖీ చేయగా నాలుగు బాక్సుల్లో కర్ణాటక మద్యం కనిపించిందన్నారు. గొల్ల గిడ్డయ్య, లక్ష్మీపేటకు చెందిన వడ్డె నవీన్, చెట్నేపల్లికి చెందిన బోయ మహానందిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 432 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించిన పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన బోయ ధర్మేంద్ర పరారీలో ఉన్నాడని తెలిపారు. తనిఖీల్లో సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి,భరత్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గంజిహళ్లి ఉరుసు



భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో బడేసాహబ్ ఉరుసు శనివారం వైభవంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంత్రాల నుంచి వేలాది మంది భక్తుల రాకతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు బడేసాహబ్ తాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా వెలసిన అంగళ్లలో మహిళలు గాజులు కొనుగోలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. చిన్నారుల కోసం అంగళ్లలో ఏర్పాటు చేసిన బొమ్మలు, రంగురాట్నాలు ఆకట్టుకున్నాయి. ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 19న మార్కెట్ వేలాలు

ఆలూరు రూరల్: ఈనెల 19న ఆలూరు పంచాయతీ పరిధిలోని మార్కెట్లకు బహిరంగ వేలాలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారపు సంత మార్కెట్, దిన కూరగాయ మార్కెట్, బస్టాండ్ వద్ద ప్రైవేటు వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు కోసం నిర్వహించనున్న వేలంపాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలన్నారు.

## ఆరుగురిపై బైండోవర్ కేసు

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామానికి చెందిన నలుగురు, మద్దికెరకు చెందిన ఇద్దరిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు శనివారం తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు.

## డీడీఓలుగా పంచాయతీ కార్యదర్శులు

తుగ్గలి: మండలంలోని 9 గ్రామ పంచాయతీలకు చెందిన గ్రేడ్-5 కార్యదర్శులను డీడీఓలుగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శనివారం తెలిపారు. రామాపురం, చిగుర్లగుట్ట తండా, ఉప్పర్లపల్లి, శభాష్‌పురం, రాంపల్లి, రామకొండ, నునుసరాళ్ల, ఎద్దులదొడ్డి, గిరిగెట్ల గ్రామ కార్యదర్శులను డీడీఓలుగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు.

## నాటుసారా స్వాధీనం

మద్దికెర: వంద లీటర్ల నాటు సారాను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మండల శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. సాతుపాటి చిరంజీవిని అరెస్టు చేసి అతని నుంచి వంద లీటర్ల నాటుసారా, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పత్తికొండ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. కేసునమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

## సుంకం మినహాయించాలి

మద్దికెర: భారీ వాహనాలను సుంకం నుంచి మినహాయించాలని ఎంపీటీసీ రామకృష్ణ, డ్రైవర్ల సంఘం నాయకులు రాఘవేంద్ర, మల్లికార్జున శనివారం ఈఓఆర్డీ నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

## పంచాయతీ వేలాలు వాయిదా

మద్దికెర: మార్కెట్ వేలాలు వాయిదా వేసినట్లు సర్పంచ్ సుహాసిని తెలిపారు. పాటదారులు గతం కన్నా తక్కువకు వేలంపాట పాడటం వల్ల వాయిదా వేశామన్నారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, నీలకంఠి తిమ్మరాజు కోరారు. మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో శనివారం వారు ఇంటింటికీ పత్తికొండ సిద్ధం స్టిక్కర్లను అతికించారు. పత్తికొండ గడ్డపై మరోమారు కంగాటి శ్రీదేవిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, అల్లీసాహెబ్ పాల్గొన్నారు.

## అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు

దేవనకొండ: ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్‌ను జారీ చేయడంతో మండలంలోని రాజకీయ నాయకులు, ప్రజలు, అల్లరిమూకలు ఎవరైనా సరే అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నగారా మోగినందువల్ల ప్రజలు ఎక్కడా గుమికూడరాదని, అల్లర్లు సృష్టించరాదని, వ్యక్తిగత దూషణలు చేసుకోరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## 'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హాలహర్వి: ఈనెల 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ ఈరన్న తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 460 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారని, ఇప్పటికే పరీక్షా కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపిరు. హాలహర్వి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 330 మంది విద్యార్థులు, ఎస్‌జేవీపీ స్కూల్‌లో 130 మంది విద్యార్థులు మొత్తం 460 మంది పరీక్షలు రాస్తారన్నారు. ఇప్పటికే డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లకు సూచనలు ఇచ్చామన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- ఆర్డీఓ నీలపు రామలక్ష్మి



పత్తికొండ రూరల్: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారిణి నీలపు రామలక్ష్మి అన్నారు. శనివారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ ఓటర్లకు ఎపిక్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇంకా ఓటర్లుగా నమోదు చేసుకోని వారికి ఏప్రిల్ 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఓటర్లకు సంబంధించి ఏమైనా సమస్యలున్నట్లయితే ఆర్డీఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారంగా ఎవరూ అక్రమ మద్యం రవాణా, రూ.20 వేలకు మించి నగదు తీసుకెళ్తూ పట్టుబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# వివాదాలకు దూరంగా ఉండండి



పుల్లగుమ్మి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): వివాదాలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం ఆయన స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మండలంలోని ఫ్యాక్షన్ గ్రామం పుల్లగుమ్మిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, రాబోయే ఎన్నికల సందర్భంగా ఎవరైనా హద్దు మీరితే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల వేళ ఆవేశాలు పనికిరావన్నారు. ఏ చిన్న గొడవైనా కేసుల వరకు దారి తీసి, కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తాయన్నారు.

## బీసీలకే సీటు ఇవ్వాలంటూ టీడీపీ శ్రేణుల ఆందోళన



సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు ఎమ్మెల్యే టికెట్‌ను బీసీలకే కేటాయించాలని కోరుతూ టీడీపీ టికెట్ ఆశిస్తున్న మాచాని సోమనాథ్ వర్గీయులు శనివారం పట్టణంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికే ఈసారి టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తూ ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించడంతో టీడీపీలోని బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌బీఎస్ కాలనీ నుంచి పార్టీ జెండాలను చేతపట్టి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలు దేరి బీసీల ఐక్యత వర్ధిల్లాలని, ఎమ్మెల్యే సీటు బీసీలకే కేటాయించాలి నినాదాలు చేస్తూ సోమప్ప సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్క టైర్లు కాల్చి నిరసన తెలిపారు.

# మరోసారి గెలిపించాలి



వెల్దుర్తిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): నియోజకవర్గాన్ని ఐదేళ్లల్లో ఎంతో అభివృద్ధి చేశానని మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం వెల్దుర్తి మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా పాతబస్టాండు చేరుకుని అక్కడ తెలుగుతల్లి, వాల్మీకి మహర్షి, అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డోన్ రోడ్డులోని ప్రభుత్వాసుపత్రి పక్కనున్న భరత్ రెడ్డి కాంప్లెక్స్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు, పల్లె పల్లెనా అభివృద్ధితో ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే హక్కు తమకు మాత్రమే ఉందన్నారు. మంచి చేసిన పార్టీని మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణగిరి ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, రవిరెడ్డి, సమీర్‌కుమార్ రెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

#### అభివృద్ధి పనుల ప్రారంభం

వెల్దుర్తి మండలంలో రూ.4.83కోట్లతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఏపీఆర్‌ఆర్‌పీ నిధులు రూ.1.45 కోట్లతో హైవే – 44 నుంచి గుంటుపల్లె గ్రామం వరకు 1.80 కి.మీ బీటీ రోడ్డును ప్రారంభించారు. జల్‌జీవన్ కింద రూ.29.41 లక్షలతో పూర్తి చేసిన ఇంటింటి కులాయి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఏపీఆర్‌ఆర్‌పీ నిధులు రూ.3.7 కోట్లతో పూర్తి చేసిన గోవర్ధనగిరి నుంచి శ్రీరంగాపురం, శ్రీరంగాపురం నుంచి లక్షుంపల్లెకు 4.10కి.మీ బీటీ రోడ్డును ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సుంకన్న, పీఆర్ డీఈ రమేశ్, గుంటుపల్లె జనార్ధనరెడ్డి, సూదేపల్లె వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బాలకృష్ణ, శ్రీరంగాపురం సుంకిరెడ్డి, వెంకటేశ్, లక్షుంపల్లె చంద్ర పాల్గొన్నారు.



శ్రీరంగాపురం, లక్షుంపల్లె గ్రామాల రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

#### బ్రహ్మగుండేశ్వరుని సేవలో శ్రీదేవి

వెల్దుర్తి పట్టణ సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రంలో కొలువైన కామేశ్వరీదేవి సమేత బ్రహ్మగుండేశ్వరుడిని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శనివారం దర్శించుకున్నారు. అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు.

# తాగు నీటి సమస్యను పరిష్కరిస్తా

- వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి



మహిళలను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న విరుపాక్షి

ఆస్పరి: రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో సర్పంచ్ హరికృష్ణ ఆధ్వర్యంలో విరుపాక్షి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్ అందుతుందా అని ఆరా తీశారు. జగనన్న మంచి పథకాలు ప్రవేశపెట్టారని, అవి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే చిన్నహోతూరు గ్రామంలో నెలకొన్న తాగు నీటి, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అంతకు ముందు గ్రామంలోని సిద్ధరామేశ్వర్వర స్వామి, మారెమ్మవ్వ, సుంకులమ్మవ్వను దర్శించుకుని పూజలు చేశారు. చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ తెర్నేకల్లు సురేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మండల కన్వీనర్ బసవరాజు, సర్పంచ్ హరికృష్ణ, నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, మారయ్య, పెద్దయ్య, దత్తాత్రేయ రెడ్డి, కేశవరెడ్డి, ప్రకాష్, పాండు, లక్ష్మన్న, శివ, తిమ్మప్ప పాల్గొన్నారు.

#### పార్టీ విజయానికి కృషి చేద్దాం

దేవనకొండ: పార్టీ విజయానికి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు అన్నారు. శనివారం పీఏసీఎస్ కల్యాణ మండపంలో జరిగిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరుదామన్నారు. సమావేశంలో నాయకులు దివాకర్‌నాయుడు, పాలకుర్తి హర్షవర్ధన్ రెడ్డి, హంపిరెడ్డి, నారాయణరెడ్డి, లుముంబా తదితరులు పాల్గొన్నారు.

#### వైఎస్సార్‌సీపీలో చేరిక



ఆలూరు రూరల్: హొళగుంద మండలం ఎం.డీ హళ్లి గ్రామానికి చెందిన 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. చిప్పగిరిలోని విరుపాక్షి స్వగృహంలో వారు పార్టీలో చేరారు. కండువాలు వేసి విరుపాక్షి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

## మాలలు ఐక్యంగా ఉండాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఆస్పరి: మాలలు ఐక్యమత్యంగా ఉండాలని మాల మహానాడు సంఘం రాష్ట్ర కార్యదర్శి పుష్పాంజలి, జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది సూచించారు. శనివారం ఆస్పరిలో మాలల మహా గర్జన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాలలకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు సంఘం నాయకులు జట్టప్ప, భరత్, వీరభద్ర, నాగరాజు, లక్ష్మీనారాయణ, వెంకటరాముడు, వీరేష్, ప్రతాప్, సంజీవ్, నాగూరు పాల్గొన్నారు.

## యాచకురాలి దాతృత్వం



సుంకమ్మను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఆలూరు: మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన సుంకమ్మ యాచిస్తూ జీవనం సాగిస్తోంది. అలా కూడబెట్టుకున్న రూ.50 వేలను శనివారం బెళ్లగుండ ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేయనున్న ఆంజనేయ విగ్రహానికి విరాళమిచ్చింది. ఆమె దాతృత్వాన్ని మెచ్చి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# ఎన్నికల కమిషన్‌కు లోబడి పనిచేయండి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్

ఆలూరు: ఎన్నికల కమిషన్‌కు లోబడి పనిచేయాలని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీఓ సమావేశభవనంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసులు, పరిశీలకులు తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ సభలు, సమావేశాలు, ఆలయాలు మసీదులు, చర్చిలు, గురుద్వారాలు ప్రార్థన స్థలాల వద్ద ప్రచారాలు, వాల్ పోస్టర్లు లేకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులకు అనుకూలంగా ఉండరాదన్నారు. నిష్పక్ష పాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు.

#### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆలూరు రూరల్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మే 13 పోలింగ్, జూన్ 4న కౌటింగ్ ఉంటుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. 08523-2325010 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చన్నారు.